




# ఎరలు

రెంటాల హనుమత్ ప్రసాద్

బయట వరండాలో ఈజీచెయిర్లో కూర్చునివుంటే ఎదురింటి కిటికీలోగుండా శాస్త్రిగారి పెద్దబ్బాయి కనబడ్డాడు. అద్దంలో చూసుకుంటూ నవ్వుకుంటున్నాడు. నాలుక బయటపెట్టి తన ప్రతిబింబాన్ని వెక్కిరించుకుంటూ బుగ్గలు బూరెల్లా చేసి మరోమారు నవ్వుకున్నాడు. దువ్వుకున్న క్రాపును చెరిపి వేసుకున్నాడు. అద్దంమీద ఒకమారు ఉమ్మేసి శుభ్రంగా అద్దాన్ని తుడిచి చొక్కా చివర్లతో కళ్లు తుడుచుకుంటూ బయటికి వచ్చి నిలబడ్డాడు వచ్చేపోయే వాళ్లను నవ్వుతూ చూస్తో. అతని వయసు పాతిక.

సిగరెట్ వెలిగించి నాకు కొద్ది దూరంలో కుక్కిమంచంలో పడుకుని వున్న నా తండ్రిని చూసేను. ఆయనకు డెబ్బయి సంవత్సరాలు వచ్చేయి. ఆయన ఏదో సన్నగా తనలో తాను గొణుక్కుంటున్నాడు. ఆయనకు మనం చెప్పేది అర్థం కాదు. పుట్టెడు చెవుడు. ఆయన చాదస్తం అందరికీ ఒళ్లుమంట. ఎప్పుడూ ఏదో గొణకడం, తత్వాలు పాడుకోవడంతో ఆయనకు విరామం దొరకదు. ప్చ్. అనుకుని తిరిగి నా దృష్టి రోడ్డుమీదకు సారించాను.

ఒక పాతికేళ్లామె చంకలో ఒక బాబు ముద్దుల మూటలుకడుతూ వున్నాడు. చక్రాల్లాంటి కళ్లు. ఆశ్చర్యంగా లోకాన్ని చూస్తున్నాడు. చూసి నవ్వుతుంటున్నాడు.

కొద్దిసేపు సిగరెట్ పీలుస్తూ వుండిపోయాను. ఇంతలో రోడ్డుమీదినుండి వెంకటావధాని వెళ్తూ కనబడ్డాడు. పంచె, సిల్కు లాల్చీ, చేతిలో వెండిపొన్ను కర్ర. బట్టతల వచ్చుటిచాయ. యాభై పైన వయసులో వున్నాడు. ఆయన, హడావుడిగా వస్తూ వెళ్తూ రోడ్డు మీది వారిని చూస్తూ తనలో తను నవ్వుకుంటున్నాడు. ఆయన పెదిమలు నవ్వుతూనే ఉన్నాయి. ఆయన పెద్ద రచయిత, కవి.

నాకు ఆశ్చర్యమనిపించింది. ఎందుకంటే ఎదురింటి శాస్త్రిగారి పిచ్చికొడుకు, నా తండ్రి, ఇంతకుముందు ఒక స్త్రీ చంక నే చూసిన పసివాడూ, రచయిత కవి అయి వెంకటావధాని వీళ్ళంత ఒక్కటే. వీళ్ళ ప్రపంచం ఒక్కటే అనిపించింది. వీళ్ళ ఆలోచనలు మనకు అవగాహన కావు.వాళ్ళదో లోకం.

రోడ్డు వారగా ఒక లారీ దూసుకు వెళ్ళిపోయింది. ప్రక్కకు ఎగిరి గంతేసిన ఒక మధ్య వయస్కుడు వీపు మీద ఒక చరుపు చరుచుకుని వ్రేలికున్న వెంకటేశ్వరుని ఉంగరాన్ని కళ్ళ కద్దుకున్నాడు భక్తిగా.

ఒక స్టూడెంట్ కుర్రాడు అది చూసి కోపంగా రోడ్డు మీది కంకరరాయిని అందుకుని బలంగా లారీ మీదకు విసిరేడు. గురి తప్పడంతో ట్యూబ్ లైట్ 'టప్' మంది. 'గూండా వెధవ' అన్నట్లు దారిన పోయే జనం చూశారు ఆ స్టూడెంట్ వంక. బుర్ర గోక్కుంటూ ప్రక్క సందులో దూరాడు అతగాడు.

"ఏటండీ! అయ్యో తమరు బోడెమ్మగార్కి హాంఫ్రేనేటి" పళ్ళు అమ్ముకునే ఒక పళ్ళ భద్రయ్య రోడ్డు మీద వెళుతున్న ఒక బామ్మగారిని అడిగాడు. చాలాకాలానికి చూసి ఉంటాడు ఆమెను పాపం.

"నీలాంటి అర్థాయుష్షు ముండా కొడుకులు దేశంలో ఎక్కువ అవుతుంటే నాలాంటి వాళ్లంతా

